అక్రమ వలసదారులతో అమృత్‌సర్‌కు చేరిన అమెరికా సైనిక విమానం

భారత్‌కు చేరిన వలసదారుల విమానం

- అమృత్‌సర్‌లో దిగిన 104 మంది భారతీయులు
- అక్రమ వలసదారులపై ట్రంప్ సర్కారు ఉక్కుపాదం

అమృత్‌సర్, ఫిబ్రవరి 5: అగ్రరాజ్యం అమెరికాలో అక్రమంగా ఉంటున్న 104 మంది భారతీయులతో మొదటి సైనిక విమానం బుధవారం మధ్యాహ్నం అమృత్‌సర్‌కు చేరుకుంది. వీరిలో 19 మంది మహిళలు, 13 మంది మైనర్లు ఉన్నారు. రాష్ట్రాల వారీగా చూస్తే వీరిలో 30 మంది పంజాబ్, 33 మంది హర్యానా, 33 మంది గుజరాత్, మహారాష్ట్ర, యూపీల నుంచి ముగ్గురేసి, చండీగఢ్‌కు చెందిన ఇద్దరు ఉన్నారు. కాగా, భారత్‌కు చెందిన 205 మంది అక్రమ వలసదారులతో మంగళవారం సీ-17 మిలిటరీ విమానం టెక్సాస్ నుంచి బయలుదేరినట్టు వార్తలొచ్చాయి. అయితే వాస్తవానికి 104 మంది మాత్రమే విమానంలో వచ్చారు.

తనిఖీల తర్వాతే...

శ్రీ గురు రామ్‌దాస్ జీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టుకు మధ్యాహ్నం 1.55 గంటలకు వలసదారులతో విమానం చేరుకుంది. వారిని ఒక టెర్మినల్‌లో ఉంచిన పోలీసులు వారి ఐడెంటిటీ, ఇతర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎవరికైనా క్రిమినల్ చరిత్ర ఉందా అన్న విషయాన్ని నిశితంగా పరిశీలించారు. పూర్తిగా తనిఖీలు జరిపి నిర్ధారించుకున్న తర్వాతే వారిని పంపుతామని అధికారులు తెలిపారు. అమెరికాలో ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమవలసదారులపై ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. కాగా, తమ చేతులకు, కాళ్లకు సంకెళ్లు వేశారని, ఎయిర్‌పోర్టులో దిగిన తర్వాతే వాటిని తొలగించారని జస్‌పాల్ సింగ్ అనే ఓ వలసదారు వెల్లడించారు. సంకెళ్లు వేయడం ద్వారా భారతీయులను అవమానించారని కాంగ్రెస్ ధ్వజమెత్తింది.

అమెరికాపై మోజు తగ్గని భారతీయులు

- అక్రమ వలసపై ట్రంప్ వేటు వేస్తున్నా.. దొడ్డిదారిన వెళ్లేందుకు యువత ఆరాటం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: అక్రమ వలసదారుల పట్ల ట్రంప్ ప్రభుత్వం ఓవైపు కర్కశంగా వ్యవహరిస్తున్నా.. అమెరికా వెళ్లాలన్న భారతీయుల యావ ఏమాత్రం తగ్గడం లేదని ఓ వార్తా కథనం పేర్కొంది. ముఖ్యంగా పంజాబ్, హర్యానాకు చెందిన యువత దొడ్డిదారిన అమెరికా వెళ్లేందుకు మార్గం చూపాలంటూ ట్రావెల్ ఏజెన్సీల చుట్టూ తిరుగుతున్నారని తెలిపింది. అక్రమ మార్గంలో అమెరికా వెళ్లాలనుకుంటున్న వారిని కొన్ని ఏజెన్సీలు ముందుగా ఆఫ్రికన్ దేశాలకు, ఆ తరువాత దక్షిణ అమెరికా దేశాలకు పంపించి, అక్కడి నుంచి మెక్సికోకు రవాణా చేసి సరిహద్దు గుండా అమెరికాలోకి అక్రమంగా పంపించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ మార్గం ఎంతో ప్రమాదకరమైనప్పటికీ భారతీయులు వెనుకంజ వేయడం లేదని ఆ కథనం వివరించింది. అమెరికాలో ప్రవేశించేందుకు మరో మార్గం బహమాస్. ఇది దాదాపు 27 గంటల ప్రయాణమని ఓ ఏజెంట్ వివరించారు. ఢిల్లీ నుంచి బహమాస్ చేరేందుకు మధ్యలో అనేక చోట్ల ప్రయాణ సాధానాలను మారాల్సి ఉంటుంది. ఆ తరువాత రెండు సముద్ర మార్గాలు.. ఒకటి మయామీ ద్వారా, రెండో పోర్ట్ ఆఫ్ హూస్టన్ ద్వారా అమెరికా భూభాగంలోకి పంపుతారు. సముద్ర మార్గం అత్యంత ప్రమాదకరమని ఆ ఏజెంట్ పేర్కొన్నారు. చిన్న చిన్న పడవల్లో వాటి సామర్థ్యానికి మించి జనాన్ని ఎక్కించి పంపుతుంటారని, అవి బోల్తాకొట్టడమో, మునిగిపోవడమో జరుగుతుంటుందని అన్నారు. గత ఐదారేండ్లలో అమెరికా, కెనడా సరిహద్దు నుంచి కూడా దొంగదారిలో పంపేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు.

గాజాను స్వాధీనం చేసుకుంటం!

- ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూతో భేటీ అనంతరం ట్రంప్ సంచలన ప్రకటన
- పాలస్తీనియన్లు యుద్ధ ప్రాంతం వీడి ఈజిప్టు, జోర్డాన్ దేశాలకు వలస వెళ్లాలని ప్రతిపాదన
- తీవ్రంగా వ్యతిరేకించిన మిత్రదేశాలు
- ఆమోదించబోమన్న హమాస్, హౌతీలు

వాషింగ్టన్, ఫిబ్రవరి 5: అమెరికా అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన డొనాల్డ్ ట్రంప్.. తన ప్రకటనలు, దుందుడుకు చర్యలతో ప్రపంచ దేశాలను హడలెత్తిస్తున్నారు. గ్రీన్‌ల్యాండ్, పనామా కెనాల్‌ను స్వాధీనం చేసుకుంటామంటూ ఇప్పటికే ప్రకటించిన ట్రంప్.. తాజాగా గాజా స్ట్రిప్‌ను సైతం స్వాధీనం చేసుకుంటామంటూ సంచలన ప్రకటన చేశారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూతో భేటీ అనంతరం ఆయన ఈ ప్రకటన చేశారు. ప్రస్తుతం గాజా స్ట్రిప్‌లో ఉంటున్న పాలస్తీనియన్లు యుద్ధ ప్రాంతాన్ని వదిలి పెట్టి మధ్య ప్రాచ్య దేశాలైన ఈజిప్ట్, జోర్డాన్‌లకు వెళ్లాలని ప్రతిపాదించారు. అయితే దానిని ఆ రెండు దేశాలూ తిరస్కరించాయి. 'గాజా స్ట్రిప్‌ను మేము స్వాధీనం చేసుకుంటాం. దానిని పునర్ నిర్మిస్తాం. దానిని సొంతం చేసుకుంటాం' అని ఆయన నెతన్యాహూతో జరిగిన సంయుక్త మీడియా సమావేశంలో తెలిపారు. 'అక్కడ ఉన్న పేలని బాంబులను వెలికి తీయాలి. స్థలాన్ని చదును చేయాలి. కూలిన భవన శిథిలాలను తొలగించాలి. ఆర్థికంగా ఆ ప్రాంతాన్ని అభివృద్ధి చేసి ప్రజలకు అపరిమితంగా ఉద్యోగాలు ఇవ్వాలి, ఇళ్లను నిర్మించాలి' అని ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఇవన్నీ అక్కడికి తిరిగివచ్చే పాలస్తీనియన్లకు కాదని ట్రంప్ సంకేతమిచ్చారు. గాజా వాసులు 20 లక్షల మంది పెద్ద మనసుతో వేరు దేశాలకు తరలి వెళ్లాలని ఆయన కోరారు. కాగా, ట్రంప్ ప్రకటనను ఇజ్రాయెల్ ప్రధాని స్వాగతించారు. ట్రంప్ ప్రణాళిక చరిత్రనే మార్చేస్తుందని ఆయన ప్రశంసించారు.

తిరస్కరించిన ఈజిప్ట్, జోర్డాన్

ట్రంప్ ప్రతిపాదనను ఈజిప్ట్, జోర్డాన్‌లు తిరస్కరించాయి. ఐరాసలోని పాలస్తీనియన్ ప్రతినిధి మాట్లాడుతూ పాలస్తీనా ప్రజల ఆశలు, ఆకాంక్షలను ప్రపంచ దేశ నేతలు గౌరవించాలని కోరారు. ట్రంప్ ప్రతిపాదనను గాజా పౌరులు సైతం తీవ్రంగా తిరస్కరించారు. గాజా ఏమన్నా చెత్తకుప్ప అని ట్రంప్ భావిస్తున్నారేమో, ఎంతమాత్రం కాదు అని రఫాకు చెందిన 34 ఏండ్ల హతెమ్ అజ్జూం ఆగ్రహం వ్యక్తం చేశారు. హమాస్ సైతం ట్రంప్ ప్రకటనను తీవ్రంగా వ్యతిరేకించింది. దీనిని ఎంత మాత్రం ఆమోదించమని స్పష్టం చేసింది.

తీవ్రంగా వ్యతిరేకిస్తున్న మిత్ర దేశాలు

ట్రంప్ ప్రతిపాదనను మిత్రదేశాలు, విరోధులు నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. పాలస్తీనాను స్వతంత్ర దేశంగానే ఉండనివ్వాలని సౌదీ అరేబియా లాంటి దేశాలు కోరాయి. ట్రంప్ జాత్యహంకార వ్యాఖ్యలను పాలస్తీనా ఇస్లామిక్ జిహాద్ గ్రూప్ తీవ్రంగా నిరసించింది. గాజాపై అమెరికా అధ్యక్షుడి ప్రతిపాదనకు వ్యతిరేకంగా పోరాడుతామని స్పష్టం చేసింది. 'గాజాపై బాంబులేసి పట్టు సాధించాలనుకున్న ఇజ్రాయెల్ ప్రణాళిక విఫలమైంది. ఇప్పుడు ఇక్కడి వారిని తరలించి గాజాను ఏదో చేస్తామంటున్న ట్రంప్ ప్రతిపాదన కూడా ఎంత మాత్రం విజయవంతం అవ్వదు ' అని ఆ సంస్థ పేర్కొంది. పాలస్తీనా ప్రజలను బయటకు పంపే ఏ ప్రయత్నాన్ని అయినా తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించింది. పాలస్తీనా ప్రజలను బయటకు పంపకుండా గాజాను పునర్‌నిర్మించాలని ఈజిప్ట్ ప్రధాని, విదేశాంగ శాఖ మంత్రి బుధవారం కోరారు. అంతర్జాతీయ సంస్థల సహకారంతో సమగ్ర ప్రణాళిక ఏర్పాటు చేసి స్థానికులను కదల్చకుండా గాజాను పునర్ నిర్మించాలని పాలస్తీనా ప్రధాని మహమ్మద్ ముస్తఫా విజ్ఞప్తి చేశారు.

గత చరిత్ర మరిచారా?

గాజాపై ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఎంతమాత్ర ఆమోదయోగ్యం కాదని తుర్కియే విదేశాంగ శాఖ మంత్రి హకన్ ఫిడన్ అభ్యంతరం తెలిపారు. గతంలో పాలస్తీనా వాసులను వారి సొంత భూముల్లోంచి వెళ్లగొట్టి, ఆ ప్రాంతాలను ఇజ్రాయెల్ వాసులతో నింపేయాలనుకోవడం వల్లే ఇజ్రాయెల్-పాలస్తీనా సంక్షోభానికి బీజం పడిన విషయాన్ని గుర్తు చేశారు. 'గాజా వాసులను అక్కడి నుంచి దేశ బహిష్కారం చేయాలనుకోవడం తప్పుడు, అర్థం లేని నిర్ణయం. దీనిని ఎంతమాత్రం సహించం' అని ఆయన స్పష్టం చేశారు. గాజా ప్రజలను బలవంతంగా ఖాళీ చేయించాలనుకోవడాన్ని తాము వ్యతిరేకిస్తున్నట్టు చైనా ప్రకటించింది.

సాహసోపేత నిర్ణయం

ట్రంప్ సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని యూఎస్ హౌస్ స్పీకర్ మైక్ జాన్సన్ ప్రశంసించారు. ఈ చర్యతో ఆ ప్రాంతంలో శాంతి, సుస్థిరత ఏర్పడుతుందని అన్నారు. హమాస్ నుంచి గాజాకు విముక్తి కలగించాల్సిందేనని యూఎస్ స్టేట్ సెక్రటరీ మార్కో రుబియా అన్నారు.

వైట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడుతున్న నెతన్యాహూ, డొనాల్డ్ ట్రంప్

దురహంకారానికి చిహ్నం

గాజా ఆక్రమణ ప్రకటన అమెరికా దురహంకారానికి చిహ్నంగా ఉందని యెమెన్ హౌతీ రెబల్స్ నేత మహ్మద్ అల్-బుఖారి విమర్శించారు. ఈ విషయంలో అమెరికా చర్యలను ఈజిప్ట్, జోర్డాన్ కనుక సవాల్ చేస్తే తాము వారి పక్షాన ఉంటామని ఆయన ప్రకటించారు.

1948 చరిత్ర పునరావృతం?

ఎప్పుడో 77 ఏండ్ల క్రితం ఎదురైన అనుభవాన్ని పాలస్తీనియన్లు ఇప్పుడు గాజా స్ట్రిప్‌లో తిరిగి ఎదుర్కొనే పరిస్థితులు కన్పిస్తున్నాయి. ఈ సందర్భంగా 1948లో నక్బా నుంచి తమను వెళ్లగొట్టిన ఉదంతాన్ని వారు గుర్తు చేస్తున్నారు. 1948లో పాలస్తీనియన్లు తమ బహిష్కరణను నక్బా అని పిలుస్తారు. అరబ్-ఇజ్రాయెల్ యుద్ధానికి ముందు, ఇజ్రాయెల్ స్థాపన తర్వాత జనాభాలో సుమారు ఏడు లక్షల మంది పాలస్తీనియన్లు ఇళ్లనుంచి పారిపోగా, మిగిలిన వారిని నిర్దాక్షిణ్యంగా తరిమేశారు. అయితే యుద్ధం తరువాత ఇజ్రాయెల్ వారిని తిరిగి రావడానికి అనుమతించ లేదు. ఎందుకంటే దాని సరిహద్దుల్లో పాలస్తీనా ఆధిక్యం ఉండేది. ఆ చర్యతో దాదాపు 60 లక్షల మంది శరణార్థులుగా మారారు. వీరిలో ఎక్కువమంది లెబనాన్, సిరియా, జోర్డాన్, ఇజ్రాయెల్ ఆక్రమిత్ వెస్ట్ బ్యాంక్‌లోని మురికివాడల లాంటి శరణార్థి శిబిరాలలో నివసిస్తున్నారు.

విదేశీ విరాళాలపై గ్రీన్‌లాండ్ నిషేధం

ట్రంప్ బెదిరింపుల నేపథ్యంలో చర్యలు

విదేశాల నుంచి రాజకీయ విరాళాలు తీసుకోవటంపై నిషేధం విధిస్తూ గ్రీన్‌లాండ్ పార్లమెంట్ మంగళవారం ఓ బిల్లును ఆమోదించింది. గ్రీన్‌లాండ్‌ను అమెరికా స్వాధీనం చేసుకుంటుందంటూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేశారు. డెన్మార్క్ ప్రధానిపై బెదిరింపులకు దిగారు. ఈ నేపథ్యంలో గ్రీన్‌లాండ్ తాజా బిల్లును తీసుకొచ్చింది. 'గ్రీన్‌లాండ్‌ను సొంతం చేసుకోవాలని, దీనిపై నియంత్రణ సాధించాలని శక్తివంతమైన మిత్ర రాజ్యాల ప్రతినిధులు భావిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో గ్రీన్‌లాండ్ భౌగోళిక, రాజకీయ ప్రయోజనాల కోసం తీసుకొచ్చిన బిల్లు ఇది' అని గ్రీన్‌లాండ్ పేర్కొన్నది.

రాహుల్ సమక్షంలో దళిత నేతకు అవమానం

పాట్నా: కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ సమక్షంలో తనకు అవమానం జరిగిందని దళిత నేత భూదేవ్ చౌదరి ఆరోపించారు. తన తండ్రి, స్వాతంత్ర్య సమర యోధుడు జగ్‌లాల్ చౌదరి జయంత్యుత్సవాలకు రాహుల్ గాంధీ హాజరయ్యారని చెప్పారు. తాను రాహుల్‌ను వేదికపై కలిసేందుకు ప్రయత్నించానని, కానీ తనకు భద్రతా సిబ్బంది అనుమతి ఇవ్వలేదని చెప్పారు. తన తండ్రి జయంత్యుత్సవాల సందర్భంగా ఏర్పాటుచేసిన ఫంక్షన్‌లో తనకు గౌరవం ఇవ్వలేదని ఆయన వాపోయారు. దీనిపై బీహార్ పీసీసీ చీఫ్ అఖిలేశ్ ప్రసాద్ సింగ్ స్పందిస్తూ, ఈ కార్యక్రమాన్ని ఓ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిందని, దీనిలో కాంగ్రెస్ పాత్ర ఏమీ లేదని చెప్పారు. భూదేవ్‌కు అవమానం జరగడాన్ని ఖండిస్తున్నానని తెలిపారు. బీజేపీ నేత నీరజ్ కుమార్ స్పందిస్తూ, దళితుల పట్ల కాంగ్రెస్ నేతల వైఖరి స్పష్టమైందని వ్యాఖ్యానించారు.

నోర్మూసుకొని కూర్చో

బీజేపీ ఎంపీ నీరజ్‌పై ఖర్గే ఆగ్రహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: రాజ్యసభలో ప్రసంగిస్తున్న సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహనాన్ని కోల్పోయి బీజేపీ ఎంపీ నీరజ్ శేఖర్‌పై విరుచుకుపడ్డారు. ప్రతిపక్ష నాయకుడు ఖర్గే బుధవారం రాజ్యసభలో ప్రసంగిస్తుండగా మాజీ ప్రధాని చంద్రశేఖర్ కుమారుడైన నీరజ్ శేఖర్ అడ్డుపడినపుడు ఈ ఘటన చోటుచేసుకుంది. తన ప్రసంగానికి అడ్డుపడిన నీరజ్‌ను ఉద్దేశించి ఖర్గే మాట్లాడుతూ, 'మీ నాన్న నేను సహచరులం. నువ్వేం మాట్లాడతావు? నిన్ను ఎత్తుకుని తిప్పాను. నోర్మూసుకుని కూర్చో' అంటూ మండిపడ్డారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ అమెరికా డాలరుతో రూపాయి మారకం దారుణంగా పడిపోతోందని చెబుతున్న సమయంలో ఈ సంవాదం జరిగింది.

గిరిజన యువతులు అందంగా ఉండరు!

ఒడిశా సీఎం, బీజేపీ నేత అనుచిత వ్యాఖ్యలు

భువనేశ్వర్, ఫిబ్రవరి 5: గిరిజన మహిళల మేని ఛాయపై ఒడిశా ముఖ్యమంత్రి, బీజేపీ నేత మోహన్ మాఝి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వారు నల్లగా ఉంటారని, అందుకే తాను వారిని పెండ్లి చేసుకోలేదని పేర్కొన్నారు. మయూర్‌భంజ్ జిల్లాలో జరిగిన ఉత్సవ్‌లో ఆయన మాట్లాడుతూ 'నేను తెల్లగా ఉన్న అమ్మాయినే పెండ్లాడాలని ఎప్పుడూ కోరుకున్నా. కానీ గిరిజన అమ్మాయిలు అందంగా ఉండరు. అందుకే నేను మయూర్‌భంజ్ అమ్మాయిని పెండ్లి చేసుకున్నా. ఆ జిల్లాతో నా అనుబంధం అలా ఏర్పడింది' అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఒక గిరిజన మహిళ శరీర రంగుపై ఉద్దేశపూర్వకంగా ప్రకటన చేసిన ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి క్షమాపణ చెప్పాలని విపక్ష బీజేడీ బుధవారం డిమాండ్ చేసింది. మాఝి వ్యాఖ్యలు గిరిజన మహిళల మనోభావాలను దెబ్బతీశాయని పేర్కొన్నది.

ఐటీ చెల్లిస్తే ఉచిత రేషన్ కట్!

అనర్హుల ఏరివేతకు కేంద్రం చర్యలు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన(పీఎంజీకేఏవై) కింద అనర్హులైన లబ్ధిదారులను ఏరివేసేందుకు ఆహార మంత్రిత్వశాఖకు ఆదాయ పన్ను(ఐటీ) శాఖ వివరాలను అందజేయనున్నది. ఆదాయ పన్ను చెల్లించని పేద కుటుంబాలకు పీఎంజీకేఏవై కింద ఉచిత రేషన్‌ను ప్రభుత్వం అందజేస్తున్నది. 2026 ఆర్థిక సంవత్సరంలో పీఎంజీకేఏవై కోసం రూ. 2.03 లక్షల కోట్లను కేంద్రం బడ్జెట్‌లో కేటాయించింది. ఆహార, ప్రజా పంపిణీ శాఖ(డీఎఫ్‌పీడీ) సంయుక్త కార్యదర్శికి ఆదాయ పన్ను (సిస్టమ్స్) శాఖ డైరెక్టర్ జనరల్ (డీజీఐటీ) సమాచారం అందచేస్తారని సీబీడీటీ తెలిపింది. లబ్ధిదారుల ఆధార్ నంబర్ లేదా పాన్‌తో పాటు మదింపు సంవత్సరాల వివరాలను సమర్పిస్తే, నిర్ణీత మొత్తం కంటే అధిక ఆదాయం కలిగిన వారి డాటాను డీజీఐటీ సిస్టమ్స్ అందజేస్తుంది. అనర్హుల వివరాలను గుర్తించడంలో ఈ డాటా కీలకం కానుంది.

గంటకు 60 మంది పిల్లలపై కుక్కల దాడి

లోక్‌సభకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: దేశంలో 2024లో గంటకు 60 మంది పిల్లలు కుక్కల దాడులకు గురైనట్టు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటుకు తెలిపింది. కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ వురపు లలన్ సింగ్ లోక్‌సభకు ఈ మేరకు లిఖితపూర్వక సమాధానమిచ్చారు. గత ఏడాది 21,95,122 మందిపై కుక్కలు దాడి చేశాయని, 37 మంది మరణించారని చెప్పారు. ఇతర జంతువుల దాడుల కేసులు 5,04,728 నమోదయ్యాయని, 11 మంది మరణించారని తెలిపారు. కుక్కకాటు బాధితుల్లో 15 ఏండ్ల వయసు లోపుగలవారు 5 లక్షల మందికిపైగా ఉన్నారన్నారు. ప్రతి నాలుగు జంతు దాడుల్లో మూడు కుక్కల దాడులేనని, రేబిస్ కారణంగా దేశంలో ఏటా 5700 మందికిపైగా మృత్యువాతపడుతున్నారని లాన్సెట్ అధ్యయనంలో తేలింది.

దివ్యాంగ వధువులకు అదానీ నజరానా

ఏటా 500 మంది పెండ్లికి 10 లక్షలు చొప్పున సాయం

అహ్మదాబాద్: అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ దివ్యాంగ వధువులకు శుభవార్త చెప్పారు. ఆయన చిన్న కుమారుడు జీత్ అదానీ వివాహం దివా షాతో ఈ నెల 7న జరగబోతున్నది. ఈ శుభ సమయంలో జీత్, దివా తీసుకున్న నిర్ణయాన్ని గౌతమ్ అదానీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఏటా 500 మంది దివ్యాంగ సోదరీమణులకు రూ.10 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందించాలని కాబోయే దంపతులు నిర్ణయించారని తెలిపారు. ఈ 'మంగళ్ సేవ' అత్యంత సంతృప్తి కలిగిస్తున్నదని, ఓ తండ్రిగా తాను గొప్ప అదృష్టవంతుడినని పేర్కొన్నారు. జీత్ దివ్యాంగ సోదరీమణుల నుంచి ఆశీర్వాదాలు తీసుకుంటున్నట్లు కనిపిస్తున్న ఫొటోలను షేర్ చేశారు. జీత్, దివా వివాహ మహోత్సవాలు ఈ నెల 7న గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో జరుగుతాయి. సంప్రదాయ పద్ధతిలో, కుటుంబ కార్యక్రమంగా ఈ పెండ్లి జరుగుతుందని గౌతమ్ అదానీ తెలిపారు.

హెచ్-1బీ ఆటో రెన్యువల్ రద్దు!

- బైడెన్ నిర్ణయంపై ట్రంప్ యూటర్న్?
- రిపబ్లికన్ సెనేటర్ల ప్రతిపాదనలు
- రద్దయితే భారతీయులపై ఎఫెక్ట్

న్యూయార్క్, ఫిబ్రవరి 5: అగ్రరాజ్యం అమెరికాలో ఉద్యోగాలు చేస్తున్న వారికి మరో చేదు వార్త. ఇప్పటికే వలసలపై ఉక్కుపాదం మోపుతున్న ట్రంప్ మరో షాక్ ఇచ్చేందుకు సిద్ధమైనట్టు తెలుస్తున్నది. గత బైడెన్ ప్రభుత్వం తీసుకొచ్చిన వర్క్ వీసాలు హెచ్-1బీ, ఎల్-1 ఆటో రెన్యువల్‌ను రద్దు చేసే దిశగా ట్రంప్ సర్కారు యోచిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. వర్క్ వీసాలు ఆటోమేటిక్‌గా 180 రోజుల నుంచి 540 రోజులకు రెన్యువల్ అయ్యేలా తీసుకొచ్చిన నిర్ణయం ట్రంప్ ఇమ్మిగ్రేషన్ పాలసీకి ప్రతిబంధకంగా మారుతుందని ఇద్దరు రిపబ్లికన్ సెనేటర్లు ప్రతిపాదించినట్టు తెలుస్తున్నది.

అక్రమ వలసదారులను గుర్తించడం కష్టం

కాంగ్రెసనల్ రివ్యూ చట్టం ప్రకారం.. బైడెన్ సర్కారు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని సెనేటర్లు జాన్ కెన్నెడీ, రిక్ స్కాట్ జనవరి 31న తీర్మానం ప్రవేశపెట్టినట్టు సమాచారం. ట్రంప్ ప్రభుత్వం అనుసరిస్తున్న కఠిన ఇమ్మిగ్రేషన్ పాలసీకి ఇది అడ్డంకిగా మారుతుందని, ప్రమాదంలో పడేస్తుందని కెన్నెడీ వాదించినట్టు తెలుస్తున్నది. 'బైడెన్ సర్కారు తీసుకొచ్చిన రూల్ వల్ల వలసదారులకు ఆటోమేటిక్‌గా 540 రోజుల వర్క్ పర్మిట్ పొడిగింపు లభిస్తుంది. ఇది ఇమ్మిగ్రేషన్ చట్టాలకు ఆటంకంగా మారుతుంది. దేశం, అమెరికన్ల భద్రతకు ముప్పుగా పరిణమిస్తుంది' అని కెన్నెడీ పేర్కొన్నట్టు తెలుస్తున్నది. మరో సెనేటర్ స్కాట్ కూడా బైడెన్ నిర్ణయాన్ని ఖండించారు. బైడెన్-కమలా హ్యారిస్ నేతృత్వంలోని డెమోక్రటిక్ ప్రభుత్వం అమెరికా ఇమ్మిగ్రేషన్ పాలసీని నిర్వీర్యం చేయాలని చూసిందని ఆయన ఆరోపించారు. 'ఏండ్లకేండ్లు అనుమతి లేకుండా అక్రమ వలసదారులకు అమెరికాలో ఉద్యోగాలు కల్పించడం అసంబద్ధమైనది. ఇది సరిహద్దు రక్షణను తుంగలో తొక్కుతుంది. అమెరికన్ల ఉద్యోగాలను కొల్లగొడుతుంది' అని స్కాట్ వాదించారు. ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోకుండా అక్రమ వలసదారులను గుర్తించడం కష్టతరమవుతుందని వారు పేర్కొన్నట్టు సమాచారం.

భారతీయులపైనే ఎక్కువ ప్రభావం

వర్క్ వీసాల అనుమతుల పొడిగింపులో జరుగుతున్న ఆలస్యాన్ని నివారించేందుకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీ (డీహెచ్ఎస్) ఈ రూల్‌ను 2024 డిసెంబర్‌లో ప్రతిపాదించింది. ఈ ఏడాది జనవరి 13న అమల్లోకి తీసుకొచ్చిన దీని ద్వారా భారతీయులతో సహా వివిధ దేశాలకు చెందిన వలసదారులు, శరణార్థులు, గ్రీన్‌కార్డు హోల్డర్లు, హెచ్-1బీ, ఎల్-1 వీసాదారుల కుటుంబసభ్యులు లబ్ధి పొందారు. ప్రధానంగా అత్యధిక సంఖ్యలో భారతీయులకు లబ్ధి జరిగింది. హెచ్-1బీ వీసాల్లో అత్యధికంగా 3.86 లక్షలు భారతీయులకు దక్కడమే అందుకు తార్కాణం. ఇది 72.3 శాతం. 2022లో ఈ సంఖ్య 77 శాతం కావడం విశేషం. అంతేకాదు, 2024 ఆర్థిక సంవత్సరంలో అత్యధికంగా 49,700 మంది భారతీయులు అమెరికా సిటిజన్‌షిప్, గ్రీన్‌కార్డులు పొందారు. 2022 మే 4న తర్వాత దరఖాస్తు చేసుకున్నవారికి బైడెన్ సర్కారు తీసుకొచ్చిన రూల్ వర్తిస్తుంది. కాగా, డీహెచ్ఎస్ సెక్రెటరీ అలెజాండ్రో ఎన్ మయోర్కస్ ఈ పాలసీని సమర్థించారు. '2021 జనవరి నుంచి అమెరికా ఆర్థిక వ్యవస్థ సుమారు 16 మిలియన్ల ఉద్యోగాలను సృష్టించింది. ఆ ఉద్యోగాలను భర్తీ చేసి వ్యాపారాలకు దోహదం చేయాలని డీహెచ్ఎస్ భావించింది' అని మయోర్కస్ తెలిపారు.

ఢిల్లీలో హోరాహోరీ!

- బీజేపీ, ఆప్ మధ్య గట్టి పోటీ
- అంచనా వేసిన ఎగ్జిట్‌పోల్స్
- కాంగ్రెస్‌కు మరోసారి సున్నానే
- ఈ నెల 8న ఫలితాల ప్రకటన

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు బుధవారం ప్రశాంతంగా ముగిశాయి. 70 స్థానాలకు జరిగిన పోటీలో అధికార ఆప్, బీజేపీ, కాంగ్రెస్ ప్రధానంగా పోటీ పడ్డాయి. 60 శాతానికిపైగా పోలింగ్ నమోదైంది. పోలింగ్ పూర్తయిన కొద్ది సేపటికే వివిధ సంస్థలు ఎగ్జిట్ పోల్స్ ఫలితాలను ప్రకటించాయి. ఆప్, బీజేపీ మధ్య హోరాహోరీ పోరు నెలకొన్నట్టు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. ఈ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ ఎలాంటి ప్రభావం చూపలేదని పేర్కొన్నాయి. ఫలితాలను ఈ నెల 8న ప్రకటిస్తారు.

నాలుగోసారి మేమే వస్తాం: ఆప్

ఎగ్జిట్‌పోల్స్ ఫలితాలను ఆప్ తిరస్కరించింది. పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ వరుసగా నాలుగో సారి అధికారంలోకి వస్తారని ఆ పార్టీ జాతీయ ప్రతినిధి రీనా గుప్తా పేర్కొన్నారు. గత ఎన్నికల్లోనూ ఎగ్జిట్ పోల్స్ ఆప్‌ను తక్కువగా అంచనా వేశాయని, కానీ 2015, 2020 ఎన్నికల్లో తమ పార్టీ క్లీన్ స్వీప్ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఢిల్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వరుసగా మూడోసారి కూడా శృంగభంగం తప్పదని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. 2015, 2020 ఎన్నికల్లో ఆ పార్టీ ఒక్క సీటు కూడా గెల్చుకోలేదు. మూడోసారి కూడా అదే పరిస్థితి పునరావృతం అవుతుందని అంటున్నారు. ఎగ్జిట్ పోల్స్ కూడా ఇవే అంచనాలు వెలువరించాయి.

సర్వే సంస్థ	ఆప్	బీజేపీ	కాంగ్రెస్
మాట్రిజ్	32-37	35-40	0-1
పీపుల్స్ ఇన్‌సైట్	25-29	40-44	0-1
టైమ్స్ నౌ	22-31	39-45	0-2
పీమార్క్	21-31	39-49	0-1
పీపుల్స్ పల్స్	10-19	51-60	0
చాణక్య స్ట్రాటజీస్	25-28	39-44	2-3
పోల్ డైరీ	18-25	42-50	0-2
డీవీ రీసెర్చ్	26-34	36-44	0
వీ ప్రిసైడ్	46-52	18-23	0-1
జేవీసీ	22-31	39-45	0-2

ఆగాఖాన్ ఇకలేరు

- 88వ ఏట కన్నుమూసిన షియా ఇస్మాయిలీ ముస్లింల ఆధ్యాత్మిక వేత్త, వితరణశీలి
- ఫౌండేషన్ ద్వారా 30కి పైగా దేశాల్లో సేవా కార్యక్రమాలు
- 2015లో పద్మవిభూషణ్‌తో గౌరవించిన కేంద్రప్రభుత్వం

పారిస్, ఫిబ్రవరి 5: ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాది మంది ఇస్మాయిలీ ముస్లిముల నాయకుడు, ప్రముఖ వితరణశీలి ఆగా ఖాన్ తన 88వ ఏట కాలధర్మం చెందారు. వర్ధమాన దేశాలలో అనాథాశ్రమాలు, దవాఖానలు, పాఠశాలలు నిర్మించి వేల కోట్ల రూపాయలను సేవా కార్యక్